సంపుటి - 5 మే - 2022 సంచిక - 11

# జీవస్వరం

ఆధ్యాత్మిక మాస పత్రిక


తండ్రి గారి సందేశం........................................3

పట్టుదలగల విశ్వాసులకు ప్రతిఫలము ........................6

కరోనా -మనం................................................8

రక్తసాక్షి దేవసహాయం జీవితచరిత్ర .........................10

బైబిల్ దర్శనం.............................................13

శుభవచనం బైబిల్ క్విజ్.....................................15

ఇంద్రధనుస్సు...............................................17

ఏంజెల్స్ కార్నర్.............................................18

పునీత జాన్ ఆఫ్ గాడ్ .......................................19

బైబిల్ దృశ్యమాలిక........................................21


శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు..........................23














**ముద్రణానుమతి**

**బిషప్ ప్రిన్స్ అంతోని గారు**

**ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు**

**సంపాదక వర్గం**

ఫాదర్ సిజో

ఫాదర్ ప్రిన్స్

సిస్టర్ హృదయ ASMI

సిస్టర్ క్రిస్టీన CMC

Mr. M. సత్యం

Mr. J. లూర్దు స్వామి

Mrs. K. శ్రీలత

**టైపింగ్ సహకారం** – D. ప్రిన్సి



**జీవస్వరం**
**బిషప్స్ హౌస్**
మంచిర్యాల- 504 208
మంచిర్యాల జిల్లా
తెలంగాణ

**Cell: 09398764408**

**Email ID - jeevaswarammagazineadb@gmail.com**

**Jeevaswaram**
**Bishop's House**
Mancherial - 504 208
Mancherial Dist
Telangana State

**నేను వేకువ రెక్కలు కట్టుకొని సముద్ర**

**దిగంతములలో నివసించినను,**

**నీ వచటను నీ చేతితో నన్ను నడిపింతువు.**

**నీ కుడి చేతితో నన్ను ఆదుకొందువు.**

**(కీర్తన 139, 9–10)**

ఫిబ్రవరి నెల

శుభవచనం బైబిల్ క్విజ్ విజేతలు

మొదటి బహుమతి

జి. జోస్న్మ, మంచిర్యాల

రెండవ బహుమతి

డి. అనూష, గంపలపల్లి

మూడవ బహుమతి

ఎ. రజిత, భీమారం

బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి

ఫిబ్రవరి నెల

ఇంద్రధనుస్సు విజేతలు

మొదటి బహుమతి

డి. దర్శన్, రంగపేట

రెండవ బహుమతి

డి. హర్షిత, మంచిర్యాల

మూడవ బహుమతి

జె. భావన, చింతగూడ (అదిలాబాద్)

బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి

# తండ్రి గారి సందేశం....



## పునరుత్థానానికి బైబిల్ ఆధారాలు

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

ప్రియ సహోదరీ సహోదరులారా, మనం ఏప్రిల్ 17వ తేదీన పునరుత్థాన పండుగను కొనియాడాము. యేసు ప్రభు పునరుత్థాన పండుగ సందర్భంగా ఆయన పునరుత్థానం గురించి పరిశుద్ధ గ్రంథం ఆధారంగా ఏడు సాక్ష్యాధారాలను పరిశీలిద్దాం.

**1. ఖాళీ సమాధి** (మత్తయి 27:62–28:15; మార్కు 16:1–6; లూకా 24:1–8; యోహాను 20:1–10): యేసు ప్రభు తిరిగి లేచినందున ఆయన శరీరాన్ని ఉంచిన సమాధి ఖాళీ అయ్యింది. యేసు ప్రభు పునరుత్థానం జరిగిన సమయంలో యెరూషలేములో ఉన్న ఎవరైనా ఆ సమాధిని సందర్శించి, అది ఖాళీగా ఉందని ధృవీకరించుకోవచ్చు. పునరుత్థానం జరిగిన వెంటనే ఆ విషయాన్ని యేసు ప్రభు అనుచరులు అంతటా వ్యాప్తి చేసినట్లు పరిశుద్ధ గ్రంథంలో నమోదు చేయబడింది. అంతేకాక, ఆ సమాధికి కాపలాదారులను నియమించి రోమా సామ్రాజ్య ముద్ర వేసారు. ఏ శరీరము లేని సమాధికి కావలి ఉండడానికి సైనికులు శ్రద్ధ చూపించి ఉండేవారు కాదు. యేసు అనుచరులు శరీరాన్ని దొంగిలించారని రోమా నాయకులు, ఉన్నత స్థాయిలోని యూదా అధికారులు ఆరోపించడం ద్వారా, నిందారోపణ చేయడం ద్వారా ఆ సమాధిలో యేసు శరీరం ఉండింది అని, తాము ఆ వాస్తవంతో ఏకీభవిస్తున్నామని వారు చెప్పకనే చెప్పినట్లయింది. యేసు ప్రభు మరణించే సమయంలో భయముతో దాగుకున్న శిష్యులు ఆయన శరీరాన్ని దొంగలించారన్న ఆరోపణ నమ్మశక్యం కాదు. యేసుప్రభు తిరిగి లేచారు. కాబట్టి, ఆ సమాధి ఖాళీగా ఉంది.

**2. యేసు మృతులలో నుండి లేచాడన్న సత్యానికి మొట్టమొదటి సాక్ష్యులు స్త్రీలేనని బైబిలు చెబుతోంది** (మత్తయి 28:1–10; లూకా 23:55–24:11; మార్కు 16:1–11; యోహాను 20:11–18). సజీవుడైన యేసుకు మొదటి సాక్షి స్త్రీలేనని యేసు శిష్యులు, అనుచరులు ప్రకటించడం చాలా ఆశ్చర్యకరమైన విషయము. ఎందుకంటే, యేసు ప్రభు జీవించిన సమయంలో యూదా సంస్కృతిలో ఒక స్త్రీ సాక్ష్యం గౌరవించబడేది కాదు. న్యాయస్థానంలో స్త్రీల సాక్ష్యం చెల్లదు. శిష్యులు ఒక వేళ యేసు తిరిగి లేచాడన్న సత్యాన్ని కుట్రపూరితంగా సృష్టించి ఉంటే, అందరు నమ్మదగిన వాదనను వారు చెప్పాలనుకుంటే, యేసును చూసిన మొదటి వ్యక్తిగా బహుశా ఒక ప్రముఖ వ్యక్తిని గాని, పురుషుని గాని చెప్పియుండాలి. కానీ, యేసును మళ్ళీ సజీవంగా చూసిన మొదటి వారు స్త్రీలు అని సువార్తలు చెప్పడం, యేసు ప్రభు పునరుత్థానం నిజమని, అది కల్పితం కాదని బలంగా సూచిస్తోంది.

**3. యేసుప్రభు తన అనుచరుల్లో చాలా మందికి ప్రత్యక్షమయ్యాడు.** (మత్తయి 28:16-17; మార్కు 16:9-11; మారు 16:12; మార్కు 16:14-18; లూకా 24:13-35; లూకా 24:36-43; యోహాను 20:11-18; యోహాను 20:19-29; యోహాను 21:1-23; అపోస్తలుల కార్యములు 1:3-11; అపోస్తలుల కార్యములు 9:1-6, 1 కొరింతీ 15:5-8). ఒకేసారి 500 కంటే ఎక్కువ మంది పునరుత్థానుడైన యేసుప్రభును చూసారని బైబిలు చెబుతోంది. యేసు ప్రభువును శత్రువుగా భావించి, యేసుప్రభు అనుచరులను అతి క్రూరంగా హింసించిన సౌలు అనే వ్యక్తికి కూడా యేసుప్రభు దర్శనమిచ్చారు. ఆ సౌలే (పౌలు) యేసుప్రభు పునరుత్థానుడు అయ్యాడని నలుదిశలా ప్రకటించాడు. పునరుత్థానుడైన యేసుప్రభు అపోస్తలుడైన పౌలు గారితో కలిపి 12 సార్లు ప్రజలకు దర్శనమిచ్చాడు. పురుషులు మరియు మహిళలకు, వ్యక్తులకు, ఇద్దరికి, సమూహాలకు ఇలా అనేక సందర్భాల్లో పునరుత్థానుడైన యేసుప్రభు దర్శనం లభించింది. ఆ దర్శనాలు ఇంటి లోపల, బయట, వేర్వురు ప్రదేశాల్లో, రోజులో వేర్వేరు సమయాల్లో జరిగాయి. యేసు ప్రభును వారు భౌతికంగా చూసారు, విన్నారు, వారి సమక్షంలో ఆయన ఆహారం తిన్నాడు. యేసు మృతులలో నుండి లేచే ముందు యేసుప్రభు నిజంగా మృతులలో నుండి లేస్తాడని ఈ సాక్షులెవరూ నమ్మలేదు. మరణానికి ముందు వారందరితో ఉన్న అదే యేసు ప్రభు, సిలువపై మరణించిన అదే యేసు, పునరుత్థానుడై వారి మధ్యలో ఉన్నారని వారు తమకు తాముగా చూసి, విని నమ్మారు.

**4. యేసు పునరుత్థానానికి ముఖ్య సాక్షుల్లో చాలా మంది పునరుత్థానం చేయబడ్డాడనే సత్యాన్ని ప్రకటించి నందుకు మరణించారు.** యేసు పునరుత్థానుడయ్యాడన్న ఆ సత్యాన్ని ప్రకటించే విషయంలో వారు వెనక్కి తగ్గినట్లయితే వారి జీవితాలు బహుశా రక్షించబడేవి. సాధారణంగా, ఎవరైనా ఏదైనా ఒక కారణం కోసం చనిపోతారని మనకు తెలుసు. వీరు పునరుత్థానమనే సత్యం కొరకు హతసాక్షులయ్యారు. వాస్తవం అవాస్తవమని చెప్పడానికి బదులుగా వారు మరణించడానికి సిద్ధమయ్యారు. పునరుత్థానం ఏదైనా కల్పిత కథో, మాయో, ఏదైనా ఊహజనితమైన విషయము అయి ఉంటే బహుశా వారు అంతగా తెగించే వారు కారు. యేసు సిలువ వేయబడడం, పునరుత్థానుడవడం వంటివి వాస్తవాలు కాబట్టి అది నిజమని వారు ప్రకటించినందుకు వారు చనిపోయారు.

**5. కొన్ని ఆధారాలు ఈ సత్యాన్ని ప్రకటిస్తున్నాయి:** సమాధి ఖాళీగా ఉంది, యేసు ప్రభు శరీరం చుట్టబడిన బట్టలు చక్కగా మడతబెట్టి ఉన్నాయి, సమాధి మూయబడిన రాయి దొర్లించబడింది, దొంగలించబడింది అనబడే యేసు శరీరము ఎన్నడూ కనుగొనబడలేదు, సమాధికి సైనికులను కాపలాగా ఉంచారు, మరియు యేసు ప్రభు మృతదేహాన్ని దొంగిలించినట్లు ఎవరూ ఎప్పుడూ ప్రకటించలేదు. యేసుప్రభు శరీరాన్ని చుట్టి ఉంచిన బట్టలు మడతబెట్టి ఉండడం ద్వారా దొంగతనం జరిగింది అనే వాస్తవం దానంతట అదే అవాస్తవం అని తెలియజేస్తుంది.

**6. యేసు మరణించి, సమాధి చేయబడి పునరుత్థానుడైన ఆ పరిసర ప్రాంతాల్లోని అనేకులు క్రైస్తవ విశ్వాసాన్ని స్వీకరించారు.** ఇది శ్రద్ధగా గమనించాల్సిన విషయం. (అపోస్తలుల కార్యముల గ్రంథము). ఆయన మరణించి పునరుత్థానం చేయబడిన కొన్ని వారాలలోనే క్రైస్తవ్యం విస్తృతంగా పెరిగింది. (అపోస్తలుల

కార్యములు 2,41) ఇంకొక ప్రాముఖ్యమైన విషయం ఏమిటంటే యేసుప్రభు మరియు ఆయన శిష్యుల పట్ల వ్యతిరేకత మరియు హింస తీవ్రంగా ఎదురైనప్పుడే అనేకులు క్రైస్తవ్యాన్ని స్వీకరించారు. "పిమ్మట వారు అపోస్తలులను లోనికి పిలిపించి కొరడాతో కొట్టించి, మరల యేసు పేరిట బోధింపరాదని ఆజ్ఞాపించి వదలివేసిరి. యేసు నామము కొరకు అవమానములు పొంద యోగ్యులమైతిమి అని వారు సంతోషముతో ఆ విచారణ సభ నుండి వెడలి పోయిరి. ప్రతి రోజు వారు దేవాలయములోను, ప్రజల ఇండ్లలోను ప్రబోధించుచు మెస్సయాయైన యేసును ప్రకటించుట మానలేదు" (అపోస్తలుల కార్యములు 5:40-42) "అందుచే యూదయా, గలిలీయ, సమరియా సీమలందంతట క్రీస్తు శ్రీసభ నిర్మితమై శాంతి చేకూరెను. అది దేవుని యెడల భయభక్తుల తోడను, పవిత్రాత్మ సహాయము తోడను జీవించుచు అధిక సంఖ్యలో దినదినాభివృద్ధి చెందుచుండెను" (అపోస్తలుల కార్యములు 9,31).

**7. యేసు మరణం, పునరుత్థానం కేవలం యాదృచ్ఛికంగా జరిగిన సంఘటనలు కావు.** తాను సిలువ వేయబడి మరణిస్తానని, సమాధి చేయబడతానని, మృతుల్లో నుండి తిరిగి లేస్తానని యేసు ప్రవచించాడు, ప్రకటించాడు. (మార్కు 8,31; 9,30-31; 10,33-34) ఇందులో గమనించాల్సిన విషయం ఏమిటంటే, యేసు ప్రభువును యూదా పెద్దలు విచారించిన ఆ రోజు తెల్లవారుజామున ఆయనకు సిలువ వేయాలని వారు నిర్ణయించారు. కానీ సిలువ మరణ శిక్ష విధించడం యూదా మత పెద్దలకు సాధ్యపడదు. ఎందుకంటే, ఒకరిని సిలువ వేసి శిక్షించడం యూదా ధర్మశాస్త్రం ప్రకారం కుదరదు. అది రోమా సామ్రాజ్యపు శిక్ష. సిలువ మరణం, మూడవ రోజున పునరుత్థానుడు అవడం ద్వారా యేసు ప్రభు తన ప్రవచనాలు, బోధనలు సత్యమని నిరూపించారు. "ఎవడును నా ప్రాణమును తీసికొనడు. నా యంతట నేనే ధారపోయుటకును, దానిని మరల తీసికొనుటకును నాకు అధికారం కలదు." (యోహాను 10,18). అలా అయితే, యేసు ప్రభు మరణ పునరుత్థానాల ద్వారా మానవాళికి రక్షణ సాధ్యమయింది అనే సత్యం కూడా నూటికి నూరుపాళ్ళు సత్యం, తిరుగులేని యదార్థం.

కాబట్టి, సహోదరీ సహోదరులారా, యేసు ప్రభు మనందరి పాప పరిహార్థం, రక్షణ కొరకు నిజముగా మరణించి పునరుత్థానుడయ్యాడని ఎటువంటి సంకోచం లేకుండా విశ్వసిద్దాం. సజీవుడు, పునరుత్థానుడు, ఏకైక లోక రక్షకుడు, మన దేవుడైన యేసు ప్రభు సాక్షులుగా జీవిద్దాం. ఆ విశ్వాసాన్ని ధైర్యముగా అందరికి ప్రకటిద్దాం.

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు



# పట్టుదలగల విశ్వాసులకు ప్రతిఫలం

1. "మీరు ఆయనను చూడక పోయినను ఆయనను ప్రేమించుచున్నారు. ఇప్పుడు ఆయనను కన్నులారా చూడకయే విశ్వసించుచున్నారు. వర్ణనాతీతమగు మహానందమును మీరు అనుభవించు చున్నారు. ఏలయన, మీ విశ్వాసమునకు ఫలితముగ మీ ఆత్మ రక్షణను మీరు పొందుచున్నారు" (1 పేతురు 1,8-9)

2. "ప్రియతమ సోదరులారా! ధృఢముగా స్థిరముగా నిలబడుడు. ప్రభు కార్యములలో స్వరదా శ్రద్ధ చూపుడు. ఏలయన, ప్రభువు సేవలో మీరు చేయు ఎట్టి కార్యమైనను నిష్ప్రయోజనము కాదని మీకు తెలియను గదా!" (1 కొరింతీ 15,58)

3. "జీవము ఉండగా నన్ను విశ్వసించు ప్రతివాడు ఎన్నటికిని మరణింపడు. నీవు దీనిని విశ్వసించుచున్నావా?" (యోహాను 11,26)

4. "మనము సత్కార్యములు చేయుట యందు విసుగు చెందరాదు. ఏలయన, మనము అట్లు చేయుట యందు నిరాశ చెందుకున్నచో, మన కృషి ఫలమంతమగు సమయము వచ్చును" (గలతీ 6,9)

5. "నీవు కరుణను, విశ్వసనీయతను అలవరచుకొమ్ము. వానిని దండల వలె నీ మెడలో ధరించుము. నీ హృదయ ఫలకముపై వ్రాసికొనుము. ఇట్లు చేయుదువేని భగవంతునికి, నరులకు ప్రీతిపాత్రుడవగుదువు" (సామెతలు 3,3-4)

5. పరిశుద్ధ గ్రంథము పలుకుచున్నట్లుగ, "ఎవడును, ఎన్నడును కననిదియు, విననిదియు, ఎన్నటికైనను సంభవింపగలదని ఎవడును భావింపనిదియు అగుదానినే తనను ప్రేమించు వారికై దేవుడు సిద్ధమొనర్చెను". (1 కొరింతీ 2,9)

6. “విశ్వాస రహితుడగు ఏ మానవుడు దేవుని సంతోషపెట్టలేడు. దేవుని చేరవచ్చు ప్రతివ్యక్తి, దేవుడు ఉన్నాడని, తన కొరకై వెదకు వారికి ఆయన ప్రతిఫల మిచ్చునని విశ్వసింపవలెను” (హెబ్రీ 11,6)

7. “అతడు విశ్వాసముతో అడుగవలెను. ఏ మాత్రమును అనుమానింప రాదు. అనుమానించు వాడు గాలిచే అటునిటు కొట్టుకొను సముద్ర తరంగము వంటివాడు” (యాకోబు 1,6).

8. “నీవు విశ్వసించినచో దేవుని మహిమను చూచెదవని నీతో చెప్పలేదా?” (యోహాను 11,40)

9. “మీకు విశ్వాసమున్న యెడల మీరు ప్రార్థనలో ఏమి అడిగినను దానిని పొందుదురు” (మత్తయి 21,22)

10. “చిత్త శుద్ధిగల నరుడు దీవెనలు బడయును. త్వరత్వరగా డబ్బు కూడబెట్టుకో గోరువారు శిక్ష ననుభవింతురు” (సామెతలు 28,20)

11. “యజమానుడు వానితో మంచిది, నీవు నమ్మిన బంటువు. స్వల్ప విషయములందు శ్రద్ధ వహించితివి. కనుక అనేక విషయములను నీకు అప్పగింతును. నీ యజమానుని ఆనందములో నీవు పాలు పంచుకొనుము” (మత్తయి 25,21)

12. “శోధనకు గురియైనను విశ్వాసము కోల్పోని వ్యక్తి ధన్యుడు. ఏలయన, పరీక్ష యందు అతడు ఉత్తీర్ణుడగుటతో అతనికి జీవ కిరీటము ప్రసాదింపబడును. అది తనను ప్రేమించు వారికి దేవుడు వాగ్దాన మొనర్చిన బహుమానము” (యాకోబు 2,12)

13. “ప్రార్థన చేయునపుడు నీవు నీ గదిలో ప్రవేశించి, తలుపులు మూసికొని అదృశ్యుడై యున్న నీ తండ్రిని ప్రార్థింపుము. అట్లయిన రహస్య కార్యములనెల్ల గుర్తించు నీ తండ్రి నీకు బహుమానము ఒసగును” (మత్తయి 6,6)

14. “ఇదిగో! నేను త్వరలో రానున్నాను. వారి వారి క్రియలను బట్టి వారికి ఒసగదగిన బహుమానములను నా వెంట తెత్తును” (దర్శన 22,12)

15. “నీవు వెళ్లుము. నీ విశ్వాసము నీకు స్వస్థత చేకూర్చినది” (మార్కు 10,52)

**“ఎవడును నా ప్రాణమును తీసికొనడు. నా యంతట నేనే ధారపోయుటకును, దానిని మరల తీసికొనుటకును నాకు అధికారం కలదు.”**

**(యోహాను 10,18).**



# కరోనా – మనం

**గత సంచిక తరువాయి భాగం**

ఆయన వైపు తలఎత్తి చూడాలని! చర్చిలో ప్రార్థనా సమావేశాల్లో ఆయనవైపు చూడటం చాలా సులువు చేతులెత్తి ప్రార్థించడం చాలా సులువు. కాని నిజ జీవితంలో ఆయనను చూస్తు నడవడం ఆయనను చూస్తూ ఓపికతో పందెంలో పరిగెత్తడం చాలా కష్టం! సృష్టిలోని ప్రతీది ఆయన అదుపులోనే ఉంటుంది. అందుకే క్రైస్తవులంగా మనకు భయం అక్కరలేదు. చాలా విషయాలు మన చేతులు దాటిపోతాయి. మన చేతుల్లో ఏమి ఉండదు. కాని ఆయన సర్వాధికారి. ప్రతీది ఆయన అదుపులోనే ఉంటుంది. సెయింట్ అగస్టిన్ ఒకసారి అన్నారు. యేసు ప్రభువు అందరికి ప్రభువు. అన్నింటికి ప్రభువు. కాకపోతే ఆయన ప్రభువే కాదు. ఆయన ప్రభుత్వాన్ని ఇన్‌స్టాల్‌మెంట్‌గా అనుభవించడానికి కుదరదు. ఆయన ప్రభుత్వం క్రింద, నేను ఉండాలంటే మనల్ని మనం పూర్తిగా ఆయనకు సమర్పించుకోవాలి. ఆయన కంట్రోల్‌లో క్రింద నేనుంటే ప్రపంచం అల్లకల్లోలమైన, తలక్రిందులైనా నేను మాత్రం సురక్షితం. మీకు గుర్తుందా, జలప్రళయం వచ్చింది, కరోనా అందర్ని చంపలేదు. కాని జలప్రళయం అందరిని కభలించింది. ఒక కుటుంబం మాత్రం, ప్రపంచం తలక్రిందులైపోతుంటే, తల్లడిల్ల పోతుంటే ఒక చెక్క బాక్స్‌లో చాలా సురక్షితంగా ఉంది. నోవా కుటుంబం. ఎందుకు? ఆయన కంట్రోల్లో ఉన్నారువారు. ఓడ బయట ఉన్నవారు ఆయన ప్రభుత్వాన్ని తిరస్కరించారు. నోవా కుటుంబం ఆయన ప్రభుత్వం క్రింద ఉంది. దయచేసి గమనించండి.

ముఖ్యంగా యువత, జీవితమంటే నా ఇష్టంకాదు. "ప్రభూ! నీ ఇష్టమే సిద్ధించును గాక!" ఎప్పుడైతే నేను ఆయన సర్వాధికారానికి లోబడతానో, ఆయన సర్వాధికారపు సింహాసనపు నీడలో విశ్రమిస్తాను. నన్ను ఏది వణికించలేదు. నేను దేనికి భయపడను. ఈ కరోనా లాక్‌డౌన్ ద్వారా ముఖ్యంగా ఈ పాఠం మనం నేర్చుకోవాలి. ఒక విషయంలో మాత్రం దేవున్ని మనం స్తుతించాలి. లాక్‌డౌన్‌లో మనకు చాలా సమయం దొరికింది. మనం ఎంతో దౌర్భాగ్యంగా తయారయ్యామంటే, చాలా బిజీ అయిపోయాం. దేవున్ని తలచుకునే సమయం లేదు. కాని ఈ లాక్‌డౌన్ వల్ల ఎక్కువ సమయం దేవుడితో గడిపే భాగ్యం మనకు దొరికింది.

ఈ కరోనా వల్ల మన మనోనేత్రాలు తెరచుకొని, మనల్ని మనం గుర్తించి, సంపూర్ణంగా దేవునికి సమర్పించుకొని, ప్రతి విషయంలో ఆయన అనుమతి తీసుకోవడం, ఆయనపై ఆధారపడడం, ఆయన ప్రభుత్వం క్రింద మనం కొనసాగ గలిగితే ఇలాంటి కరోనాలు, ప్రకృతి విపత్తులు మనల్ని ఏమి చేయలేవు. దేవుడు మనందరికి కనువిప్పును కలిగించాలని ప్రార్థించుకుందాము. సమస్త ఘనత స్తుతి ఆరాధన, మహిమ ఆయనకే చెందును గాక! ఆమెన్.

లూర్థుస్వామి,
బెల్లంపల్లి

**మార్చి నెల**
**శుభవచనం బైబిల్ క్విజ్ విజేతలు**


మొదటి బహుమతి
**జి. సంతోష, బొక్కలగుట్ట**
రెండవ బహుమతి
**ఎల్. వెంకటేష్, గొల్లపల్లి**
మూడవ బహుమతి
**ఆర్. చంద్రశేకర్, చంద్రపల్లి**

**బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి**

**మార్చి నెల**
**ఇంద్రధనుస్సు విజేతలు**

మొదటి బహుమతి
**ఓ. మేరి రోస్, చింతగూడ (అదిలాబాద్)**
రెండవ బహుమతి
**ఇస్సాకు, చెన్నూర్**
మూడవ బహుమతి
**కె. నిత్య, చంద్రపల్లి**

**బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి**




## రక్తసాక్షి దేవసహాయం జీవితచరిత్ర (1712 – 1752)

1712లో కన్యాకుమారి జిల్లాలోని వాసుదేవన్ నంపుతిరి మరియు దేవకమ్మ అనే హిందూ కుటుంబంలో దేవసహాయం జన్మించాడు. ఆయన అసలు పేరు నీలం. నీలకంఠన్ అని కూడా పిలువబడేవాడు. ఈ పేరు నీలకంఠన్ అని కూడా పిలవబడే హిందూ దేవుడైన శివుడిని సూచిస్తుంది. సమాజంలో ఉన్నత కులానికి చెందిన వాడు కావడం చేత నీలం రాజు గారి అస్థానంలో స్థానం పొందాడు. యుద్ధకళలో శిక్షణ పొంది విలువిద్యలో, యుద్ధాయుధాల వాడకములో ప్రావీణ్యతను పొందాడు. ధైర్యవంతుడైన సైనికుడిగా తన జీవితాన్ని ప్రారంభించిన అతను ఆ తరువాత పద్మనాభపురంలోని నీలకంఠస్వామి ఆలయంలో అధికారి అయ్యాడు. అతను రాజు ఖజానాలో కూడా పనిచేస్తూ ఉదయగిరి కోటలో రాజభవన అధికారిగా ఉన్నాడు. ఆయన భార్గవియమ్మాలును వివాహం చేసుకున్నాడు.

యుస్టాచిచియస్ డి లానోయ్ అనే డచ్ నావికాదళ కమాండర్, 1741లో జరిగిన కొలాచెల్ యుద్ధంలో ఓడిపోయినప్పటికీ ట్రావెన్ కోర్ రాజు నమ్మకాన్ని సంపాదించి ట్రావెన్ కోర్ సాయుధ దళాలకు కమాండర్ అయ్యాడు. నీలకంఠన్ చేసే కార్యములు అతనిని డి లానోయ్ గారికి దగ్గర చేశాయి. 1744లో నీలకంఠన్ ఒక రాజు విచారణకు గురికావాల్సి వచ్చి తన సంపదలో ఎక్కువ భాగాన్ని కోల్పోయాడు. గొప్ప క్రైస్తవ విశ్వాసి అయిన డి లానోయ్ పాత నిబంధనలోని యోబు కథను, సహించలేని విషాదాల నడుమ దేవునిపై యోబుకున్న అచంచలమైన నమ్మకం గురించి ఆయనకు వివరించాడు. నీలకంఠన్ అతని మాటలను ఎంతో ఓర్పుగా విని ఓదార్పును పొందుకున్నాడు. దేవునిపై యోబుకున్న పరిపూర్ణ నమ్మకానికి ఆయన ముగ్ధుడయ్యాడు. క్రీస్తు ప్రభును, సువార్తను తెలుసుకున్న నీలకంఠన్ క్రైస్తవ విశ్వాస సత్యాలను విశ్వసించి బాప్తిస్మం తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. క్రైస్తవ విశ్వాసాన్ని స్వీకరించడం నిషేధించబడిన ట్రావెన్ కోర్ రాజ్యానికి వెలుపల ఉన్న వకక్కంకుళంలో నివసిస్తున్న యేసు సభ గురువు జోవాన్ని బటిస్టా బుట్టారి ఎస్.జె.ను కలవమని డి లానోయ్ నీలకంఠన్ చేతికి ఒక లేఖ ఇచ్చి పంపాడు. ఆ సమయంలో జోవాన్ని బటిస్టా బుట్టారి గురువు గారు నెమన్ మిషన్ అధిపతిగా ఉన్నాడు.

నీలకంఠన్ తొమ్మిది నెలలు పాటు క్రైస్తవ విశ్వాసములో శిక్షణ పొందాడు. అతనిలో బాప్తిస్మం తీసుకోవాలనే కోరిక మాత్రమే కాకుండా విశ్వాసం కోసం తన రక్తాన్ని చిందించాలనే ఉత్సాహాన్ని కూడా

ఫాదర్ బుట్టారి కనుగొన్నాడు. 1745 మే 14న 32 సంవత్సరాల వయస్సులో నీలకంఠన్ బాప్తిస్మం పొంది దేవసహాయం అనే పేరును స్వీకరించాడు. అతను అతని భార్య భార్గవియమ్మకు జ్ఞానపూ అనే పేరు పెట్టాడు.

క్రీస్తు ఆత్మచే ప్రేరేపించబడి దేవుని కృప వలన ఆయన సువార్తను ప్రకటిస్తూ ఆనాటి మూఢనమ్మకాలకు మరియు అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రసంగించాడు. దేవసహాయం సువార్త ప్రకటన కృషి ఫలితంగా కొంతమంది సైనికులు, రాజు అస్థానంలోని అధికారులు, మంత్రులు కూడా క్రైస్తవ విశ్వాసాన్ని స్వీకరించారు. నట్టళంలోని తన ఇంటిలో 'హిందూ పూజ' జరగడాన్ని, ప్రసాదం స్వీకరించడాన్ని నిరాకరించాడు. ఇవన్నీ సమాజంలో అతని స్థాయిని తగ్గించింది. దానిని అతను సంతోషంగా అంగీకరించాడు. ఆయన చేసిన సువార్త ప్రకటనను అంగీకరించి అనేక మంది క్రైస్తవ విశ్వాసాన్ని స్వీకరించారు. అనేక మంది యేసు ప్రభువును దేవునిగా అంగీకరించి క్రైస్తవులుగా మారారు. మూఢనమ్మకాలకు, అన్యాయాలకు వ్యతిరేకంగా ఆయన సమాజాన్ని మేల్కొలిపారు. దీనిని ఇష్టపడని వారు దేవసహాయానికి వ్యతిరేకంగా రాజు దగ్గర ఆయనకు వ్యతిరేకంగా అబద్ధ ఆరోపణలు చేయడం మొదలుపెట్టారు. రాకుమారుడు దానముగా ఇచ్చిన భూమిలో చర్చిని నిర్మించడానికి సర్వోన్నత గవర్నరు అయిన దళవుడిని దేవసహాయానికి వ్యతిరేకంగా అతనిపై అనేక అబద్ధ ఆరోపణలను అతని వ్యతిరేకులు లేవనెత్తారు. అతను బాప్తిస్మము పొందిన దాదాపు నాలుగు సంవత్సరాల తరువాత 1749 ఫిబ్రవరి 23న దేవసహాయం బందీ అయ్యాడు. దేవసహాయం మిత్రుడు డి లానోయ్ రాజును ఒప్పించి దేవసహాయాన్ని రక్షించడానికి తన శాయశక్తులా ప్రయత్నించాడు, కాని ఆ ప్రయత్నాలు ఫలించలేదు.

క్రైస్తవ విశ్వాసాన్ని త్యజించమని రాజు దేవసహాయాన్ని ఆదేశించాడు. ఆలా జరగపోతే క్రూరమైన శిక్షలు విధిస్తానని హెచ్చరించాడు. రాజుపట్ల ఎనలేని గౌరవమున్న దేవసహాయం తన మరణం వరకు కూడా క్రైస్తవ విశ్వాసానికి కట్టుబడి ఉంటానన్న తన దృఢ సంకల్పాన్ని రాజుకు మర్యాదగా సెలవిచ్చాడు. రాజు దేవసహాయానికి మరణశిక్ష విధించాడు. శిక్షను గురించి తెలుసుకున్న దేవసహాయం రక్తసాక్షి అవుతున్నందుకు సంతోషించాడు. మరణ శిక్ష విధించే ప్రదేశానికి అతనిని ఊరేగింపుగా తీసుకువెళ్ళారు. అయితే దేవసహాయం మరణం రాజ్యంలో పెను విపత్తును సృష్టించే ప్రమాదం వస్తుందని కొందరు రాజును హెచ్చరించినందువల్ల రాజు మరొక మరొక ఉత్తర్వు ద్వారా మరణ శిక్షను రద్దు చేశాడు.

ఆ కాలంలో ట్రావెన్కోర్ రాజ్యంలో ఖైదీలను ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి, ఒక స్థానిక అధికారి నుండి మరొక అధికారికి దగ్గరకు తీసుకువెళ్ళేవారు. దేవసహాయమును కూడా ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి, ప్రత్యేకించి కతోలిక విశ్వాసాన్ని స్వీకరించిన వారు నివసించే గ్రామాల గుండా తీసుకెళ్లారు. ఆయనను అనేక హింసలకు, శిక్షలకు, అవమానాలకు గురిచేశారు. ఆయనను మండుటెండలో బహిరంగంగా చెట్టుకు కట్టేసి చిత్ర హింసలకు గురి చేశారు. భవిష్యత్తులో క్రైస్తవ విశ్వాసాన్ని స్వీకరించే వారికి హెచ్చరికగా ఉండాలని దేవసహాయాన్ని రాజధాని గుండా కాలినడకన 16 రోజుల పాటు అవమానకరంగా ఊరేగించారు. దేవసహాయం ఈ శిక్షలు, బాధలన్నిటినీ ఓర్పుతో, ఆనందంతో భరించాడు. కాని యేసు ప్రభువుని, క్రైస్తవ విశ్వాసాన్ని నిరాకరించడానికి సిద్ధపడలేదు.

చివరిగా దేవసహాయాన్ని రాజ్యానికి వెలుపల ఉన్న అరల్వైమొరికి రహస్యంగా తీసుకువచ్చారు. అయితే, ఆ రహస్య స్థలం గురించి తెలుసుకొని దగ్గర్లోని ప్రాంతాలకు చెందిన ప్రజలు ప్రతిరోజూ అయన దగ్గరకు వచ్చేవారు. ఎంత ఎక్కువగా వచ్చేవారంటే నిర్మానుశ్యంగా ఉండాల్సిన కారాగారం జాతరను తలపించేది. దేవసహాయాన్ని ఇంకా బ్రతకడానికి అనుమతిస్తే క్రైస్తవ విశ్వాసం మరింత వ్యాప్తి చెందుతుందని అధికారులు అందోళన చెందరు. దేవసహాయానికి రహస్యంగా మరణ శిక్ష విధించడానికి రాజు నుండి ఆజ్ఞను పొందాలని పథకం రచించాడు.

1752 జనవరి 14వ తేదీ అర్ధరాత్రి నిద్రలో ఉండగా దేవసహాయాన్ని సైనికులు మేల్కొల్పి కట్టాడిమలై అనే మరో ప్రదేశానికి తీసుకువెళ్లారు. వారు మరణ శిక్ష విధించే ప్రదేశానికి చేరుకున్నప్పుడు, ప్రార్థించడానికి కొంత సమయం ఇవ్వమని దేవసహాయం సైనికులతో వేడుకున్నాడు. అందుకు వారు అనుమతించారు. దేవునికి తనను తాను పూర్తిగా సమర్పించుకుని రాతిపైన మోకరిల్లి పావు గంటపాటు చివరి ప్రార్థన చేసాడు. ఆ మోకరిల్లిన రాయిపై ఇప్పటికీ అతని మోచేతులు మరియు మోకాలి గుర్తులు ఉన్నాయి. దేవసహాయం తన ప్రార్థనను పూర్తి చేసిన తరువాత, తన కర్తవ్యం పూర్తయ్యిందని, ఇక వారు తమ కర్తవ్యాన్ని నిర్వర్తించగలరని సైనికులకు చెప్పాడు. సైనికులు అతనిపై కాల్పులు జరిపారు. అతను బిగ్గరగా "యేసు, నన్ను రక్షించు" అని అరుస్తూ కింద పడిపోయాడు. యేసు ప్రభు పేరును ఉచ్చరిస్తూ దేవసహాయం మరణించాడు. మూడు సంవత్సరాల పాటు చెరసాలలో ఉన్న దేవసహాయం గారు తన 40వ యేట రక్తసాక్షి మరణం పొందారు.

సైనికులు అతని మృతదేహాన్ని కొండపై నుంచి కింద ఉన్న పొదల్లోకి పడవేశారు. మరణశిక్ష పూర్తిగా రహస్యంగా జరిగింది. ఐదు రోజుల తరువాత మృత దేహం పడవేయబడిన ఆ ప్రదేశాన్ని, ఆయన దేహాన్ని ప్రజలు కనుగొనగలిగారు. వారు ఆయన దేహాన్ని కొట్టార్‌లోని పునీత ఫ్రాన్సిస్ జేవియర్ దేవాలయ ప్రధాన బలిపీఠం ముందు ఘనంగా సమాధి చేశారు. సాధారణంగా బిషప్ గార్లకు మరియు ప్రకటింపబడిన పునీతులకు మాత్రమే ఇవ్వబడే ఈ అవకాశం దేవసహాయం అనే సామాన్య విశ్వాసికి ఇవ్వబడింది. దేవసహాయం గారి సమకాలీనులు ఆయనను ఒక గొప్ప సాధువుగా, ఆయన మరణాన్ని రక్తసాక్షి మరణంగా భావించారన్న దానిని ఇది సూచిస్తుంది.

దేవసహాయం గారి బలిదానంతో ముడిపడి ఉన్న మదత్తువిలై, అప్పట్టువిలై, పెరువిలై, పులియూర్కురిచి, కక్కురిచి, పుల్లని, పల్లియాడి మొదలైన గ్రామాల్లోని అనేకులు వారి రక్త సాక్షి మరణం తరువాత క్రైస్తవ విశ్వాసాన్ని స్వీకరించారు. బాప్తిస్మం తీసుకున్న అనేకులు దేవసహాయం అనే పేరును వారి బాప్తిస్మ పేరుగా స్వీకరించారు. దక్షిణా భారతదేశంలో యేసు సభ గురువుల మిషన్ ప్రాంతాలతో మొదలై దేవసహాయం గారి పట్ల భక్తి, గౌరవం విస్తృతంగా వ్యాపించింది. 2012 డిసెంబర్ 2వ తేదీన నాగర్ కోయిల్ ప్రాంతంలోని కొట్టార్ మేత్రాసనంలో జరిగిన ఘనమైన వేడుకలో పోప్ బెనెడిక్ట్ XVI గారి ప్రతినిధిగా కార్డినల్ ఏంజెలో అమాతో గారు దేవసహాయం గారిని రక్తసాక్షిగా మరియు ధన్యునిగా ప్రకటించారు. 21-02-2020నాడు పోప్ ఫ్రాన్సిస్ గారు దేవసహాయం గారిని పునీతునిగా ప్రకటించాలనే ప్రతిపాదనను ఆమోదించారు. **2022 మే 15న పోప్ ఫ్రాన్సిస్ గారు ధన్యుడైన దేవసహాయం గారిని పునీతునిగా ప్రకటిస్తారు.**




గత సంచిక తరువాయి భాగం

### 3.5 కుష్ఠురోగికి స్వస్థత 1:40–45

యేసు క్రీస్తు కాలములో, కుష్ఠువ్యాధులు కలిగిన వ్యక్తులు అశుద్ధులుగ పరిగణించబడేవారు. వారికి దేవుని ఆరాధనలో, సామాజిక జీవితములో పాలు లేదు. వారు సమాజము నుండి వెలివేయ బడినారు. ఆ కుష్ఠువ్యాధి వారి నుండి మిగిలిన వారికి సోకకుండా కాపాడాలని ఆలోచించారే కాని, కుష్ఠువ్యాధిగ్రస్తుల దయనీయ పరిస్థితిని పట్టించుకునే వారు కాదు (లేవీ 13,14 అధ్యాయాలు).

ఈ కుష్ఠువ్యాధిగ్రస్తుని స్వస్థత ద్వారా క్రీస్తు సమాజము నుండి వెలివేయబడిన, వారిని చేరదీయువానిగ తెలియజేస్తున్నాడు. అంతేగాక, కుష్ఠువ్యాధి నుండి స్వస్థుడైన వానిని కానుకలను చెల్లించమని చెప్పుట ద్వారా, సామాజిక, ఆరాధన క్రమములను గౌరవించువానిగ అర్థము చేసుకోగలము. ఈ కుష్ఠువ్యాధిగ్రస్తుని స్వస్థత ద్వారా మానవుని శారీరక ఆరోగ్యము, సామాజిక భద్రత, దైవారాధన క్రమములో దేవునికున్న ఆసక్తి, శ్రద్ధ తెలుస్తుంది. స్వస్థత పొందిన వ్యక్తి క్రీస్తు ఆజ్ఞకు వ్యతిరేకముగ ఆయన గూర్చి ఎక్కువగ ప్రచారము చేసాడు. అది క్రీస్తు పరిచర్యకు ప్రతిబంధకమైనది. కావున ప్రతి క్రైస్తవుడు గూడ క్రీస్తు ఆజ్ఞకు విధేయించాలి.

### 3.6 పెరుగుతున్న విభేదములు, శత్రుత్వము – 2:1–36

ఈ విభాగములో పరిసయ్యులు, ధర్మశాస్త్ర బోధకుల నుండి క్రీస్తు పట్ల పెరుగుతున్న విబేధములను, శత్రుత్వమును గమనించగలము.

**3.6.1 పక్షవాతరోగికి స్వస్థత – 2:1-12**

క్రీస్తు మరలా కఫర్నామునకు తిరిగి వచ్చాడు. ఆయన బోధించుచుండగ పక్షవాతరోగి నలుగురు స్నేహితులు అతనిని పైకప్పునుండి యేసు ముంగిట ఉంచారు. ఈ చర్య వారి విశ్వాసమును తెలియజేస్తున్నది అంతేగాక, ప్రభువు బోధ వినుచున్న మిక్కుటమైన ప్రజాగుంపును సూచిస్తుంది. వారి విశ్వాసానికి ఆయన స్పందించాడు. స్వస్థతకు ముందుగ క్రీస్తు ఆ పక్షవాత రోగి పాపములను మన్నించాడు. దీని ద్వారా యేసుక్రీస్తు వారు దేవుని దగ్గరకే వచ్చారని తెలియచేస్తున్నాడు. స్వస్థత ద్వారా కంటే పాపక్షమాపణ ద్వారా క్రీస్తు తన దైవత్వమును చాటుచున్నాడు. ఎందువలననగ, పరిసయ్యులు, ధర్మశాస్త్రబోధకులు గొణుగుచున్నట్లు దేవుడొక్కడే పాపములను క్షమింపగలడు. మార్కు తన సువార్త ప్రారంభముననే "దైవకుమారుడగు యేసుక్రీస్తు సువార్త" నుడివినట్లు యేసుక్రీస్తు ఈ పాప క్షమాపణ ద్వారా, తాను దేవుని కుమారుడనని, స్వస్థత ద్వారా తన రాకడ సువార్తయని చాటుచున్నాడు.

క్రీస్తునందే మనకు పాపక్షమాపణ, స్వస్థత కలవు. పాపము మనలను బానిసలుగా చేసి, అశాంతికి గురి చేస్తున్నది. "పాపము చేయు ప్రతివాడు పాపమునకు దాస్యుడు'' (యోహాను 8,34). "కుమారుడు మిమ్ము స్వతంత్రులను చేసిన యెడల నిజముగ మీరు స్వతంత్రులై ఉందురు" (యోహాను 8,36). ఈ పాపదాస్యము నుండి క్రీస్తు మనలను విముక్తి చేయగలరు. శారీరక స్వస్థతతో పాటు, ఆధ్యాత్మిక స్వస్థతను కలుగజేసి మనకు సంపూర్ణ ఆరోగ్యమును, ఆనందమును క్రీస్తు ఇవ్వగలరు. కదలలేని స్థితిలో పడకపై మోసుకురాబడిన వ్యక్తి పాపమన్నింపు పొంది స్వస్థుడై పడకనెత్తుకొని వెళ్ళిపోయాడు. విశ్వాసముతో క్రీస్తును సమీపిస్తే మనము ఆ స్వస్థతను పొందగలము.

**3.6.2 సుంకరికి శిష్యస్థానము – 2:13-17**

సుంకరికి శిష్యస్థానము కల్పించుట ద్వారా క్రీస్తు ప్రారంభించిన పాపమన్నింపు పరిచర్య కొనసాగుతున్నది. సమాజము చేత వెలివేయబడి, పాపిగా పరిగణింపబడే సుంకము వసూలు చేయు లేవికి శిష్యస్థానము కల్పించుట ద్వారా యేసుప్రభు శిష్యత్వములో, ఆయన విందులో పాపులకు సుంకరులకు గూడ స్థానము కలదని యేసు తెలియజేస్తున్నాడు. వారితో విందారగించుట ద్వారా యేసు దీనిని ప్రస్ఫుటం చేయుచున్నాడు. ఈ సుంకరులు యూదులను పాలిస్తున్న రోమీయుల కొరకు సుంకమును వసూలు చేసేవారు. అందువలన సుంకరులను పాపులుగ పరిగణించేవారు. పక్షవాత రోగి పాపములు మన్నించుట ద్వారా, లేవిని పిలుచుటలో, సుంకరులు, పాపులతో విందారగించుట ద్వారా, క్రీస్తు తన రాక ఉద్దేశ్యమును తెలియజేస్తున్నాడు. "నేను పాపులను పిలువవచ్చితిని, కాని, నీతిమంతులను పిలుచుటకు రాలేదు" (2,17).

కావున మనము ఎవరిని గూడ పాపులుగ, అనర్హులుగ పరిగణించి వెలివేయగూడదు. అందుకు భిన్నముగ సమాజములో వెలివేయబడి, చులకన చేయబడి, అణగారిపోతున్న వారిపట్ల ప్రత్యేక ప్రేమను, శ్రద్ధను కనపరచాలి. ఇదే క్రీస్తు తెలియజేస్తున్నాడు. ఎవరు కూడా పరిసయ్యులవలె తమను తాము నీతిమంతులుగ భావించు కుంటూ, ఇతరులను నీచముగ భావిస్తూ కించపరచకూడదు.

**సశేషం.....**

# శుభవచనం బైబిల్ క్విజ్

**యెహెజ్కేలు 25-48 అధ్యాయాలు**

పేరు ..........................ఇంటి పేరు.......................విచారణ ............................

ఫోన్ నెంబర్.................................

## I. క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి

1) నేను ప్రజలను వారి హేయమైన .................................................. గాను శిక్షింతును.

2) నేను నా సేవకుడైన ..................................................... కిచ్చిన నేల మీదనే వసింతును.

3) నీకు కావలి కాయుటకు ఒక ................................., ................................ నియమించితిని.

4) నా సేవకుడైన ............................................ వానికి ఒక్క కాపారినిగా నియమింతును.

5) నేను యిస్రాయేలీయులపై .......................................................... క్రుమ్మరింతును.

6) ప్రభువు ............................................... తూర్పు ద్వారము నుండి దేవాలయమును ప్రవేశించెను.

7) నా పవిత్ర .............................................................. కాపాడుకొందును.

8) వసారా ప్రక్కనగల లోపలి గోడల మీద .................................................. వృక్షములను చెక్కిరి.

9) నేల అంతటిలోను ..................................................... అర్పించిన నేల శ్రేష్ఠమైనది.

10) అది దేశమున ......................................................... భూమి యగును.

11) దేవాలయము చుట్టు .................................................. అడుగుల వెడల్పు గల కప్పు కలదు.

12) నేను మీ ........................................................... నుండి మిమ్మాదరింతును.

13) కాపరి లేనందును .......................................................... చెల్లా చెదరయ్యెను.

14) మీకు నూత్న ........................................................... దయ చేయుదును.

15) యోసేపు తెగకు ............................................................... వంతులు రావలెను.

16) నేను .................................................. పర్వత సీమను ఎడారి చేయుదును.

17) నేను ..................................................... మీలో ఉంచి మీరు జీవించునట్లు చేయుదును.

18) ఈ పవిత్ర స్థలము ......................................... వంశజులైన యాజకులకు చెందును.

19) నేను ................................................................... రాజు చేతులను బలపరుతును.

20) నా సేవకుడైన దావీదు వారిని ........................................................... పాలించును.

21) ఈ రెండు కట్టడములును .............................................................. .

22) విశ్రాంతి దినమును ................................................................ గడపవలెను.

23) మిమ్ము మరల ................................................... దేశమునకు తోడ్కొని వత్తును.

24) ................................................................... వలన నీకు మిగుల పొగరెక్కినది.

25) నేను మీ ................................................................ నుండి మిమ్ము రక్షింతును.

**శుభవచనం బైబిల్ క్విజ్ జవాబు పత్రాన్ని విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలో గానీ మే నెల 20వ తేదీలోపు మాకు పంపించాలి.**

**వచ్చే నెల పాఠ్యాంశం: దానియేలు గ్రంథం 1 -14 అధ్యాయాలు**

# ఇంద్రధనుస్సు

"చిన్నబిడ్డలను నా యొద్దకు రానిండు. వారిని ఆటంకపరపకుడు. ఏలయన అట్టి వారిదే పరలోకరాజ్యము" అనే మాటతో చిన్న పిల్లలపైనా తనకున్న ప్రేమాభిభావాన్ని చూపించిన యేసయ్యను మనం ప్రేమిద్దాం. ఈ అంశాన్ని తెలిపే ఈ చిత్రాన్ని రంగులమయం చేద్దాం.



**పేరు:..................................వయస్సు........తరగతి........స్థలం.................**

**సూచన :**

1. కేవలం 15 సం॥ల లోపు పిల్లలే ఈ పోటీలో పాల్గొనాలి.
2. రంగులు నింపిన చిత్రాన్ని మీ విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలోగానీ మే నెల 20వ తేదీలోపు మాకు పంపించాలి.



# "పిల్లలూ! యేసయ్య మిమ్ములను పిలుస్తున్నాడు"

**ప్రియమైన చిన్ని బిడ్డలారా!**

బిడ్డలారా! ప్రభువునందు మీరు మీ తల్లిదండ్రులకు విధేయులై ఉండవలెను. ఇది మీ ధర్మము. "నీ తల్లిదండ్రులను గౌరవింపుము. అనునది వాగ్దానముతో కూడిన ప్రథమ ఆజ్ఞ. అప్పుడు నీకు క్షేమము కలుగును. నీవు భువియందు చిరకాలము వర్ధిల్లుదువు". (ఎఫెసీ 6,1-3).

చిన్న బిడ్డలారా, యేసయ్య మీకు భువియందు చిరకాలము వర్ధిల్లడానికి ఒక్క మంచి సలహానిస్తున్నాడు. అదేమిటంటే తల్లిదండ్రులను గౌరవించటమే. అదే విధంగా వారికి విధేయులై ఉంటడమే.

**తల్లిదండ్రులను గౌరవించడం ఎలా?**

- వారు చూపిన మార్గంలో మీరు నడిచినప్పుడు
- మీకు తగినట్లు చిన్న చిన్న సహాయం వారికి అందించినపుడు.
- వారు కష్టపడి పని చేసి అలసిపోయినపుడు, వారిని మీ చిరునవ్వుతో సంతోషపెట్టినపుడు.

తల్లిదండ్రులను గౌరవించడము, వారిని ప్రేమించడం అనేది, దేవుని గౌరవించడం దేవుని ప్రేమించడము అని మరచిపోవద్దు. ఎందుకంటే అద్రుశ్యుడైన దేవుని దివ్యమైన ప్రతిరూపము మన తల్లిదండ్రులు. వారలను గౌరవించకుండా, ప్రేమించకుండా ఎట్లు దేవుని గౌరవించగలరు, ప్రేమించగలరు. అనుదిన జీవితములో వారిని గౌరవిద్దాం. ప్రేమిద్దాం. అప్పుడు యేసు ప్రభువునకు నచ్చిన బిడ్డలుగా మనము మారుతాము. దేవుని ఆశీర్వాదము కోరుకుంటూ మంచి బిడ్డలవలె జీవిద్దాం.

దేవుడు మిమ్ములను దీవించును గాక.




## పునీత జాన్ ఆఫ్ గాడ్

**(వైద్యపరిచారక బ్రదర్లసభ స్థాపకుడు, పుస్తక విక్రేతలు, ముద్రాపకులు, హృద్రోగులు, వైద్యశాలలు, నర్సులు, రోగుల పాలకపునీతులు (క్రీ॥శ॥ 1495-1550)**

దేవుడు మనపై చూపే అపార ప్రేమను గుర్తించగలిగితే మనం తప్పక పునీతులం కాగలం. పునీతులైన వారందరిలో ఈ సూత్రం స్పష్టంగా గమనించగలం. ప్రేమ శక్తివంతమైనది. కదిలించగలది. ఇలా ప్రేమవలన కలిగే ఆలోచనలు. స్పందన ప్రతిస్పందనలు చరిత్రపుటల్నే మార్చేస్తాయనడంలో సందేహం లేదు. మహత్తరమైన ప్రేమ వలనే క్రీస్తు మానవాళి పాపవిమోచనకై సిలువ శ్రమలనుభవించి, రక్తతర్పణం చేశారు. ఈ ప్రేమే మనం పునీతులుగా జీవించడానికి, అందుకోనవేమ మరణాన్నైనా ఎదిరించడానికి సిద్ధపడేలా చేస్తుంది. ఈ ప్రేమతత్వం గూర్చి ఎవరు మాట్లాడినా ఎంత మాట్లాడినా దానికి అంతం లేదు. ఎందుకంటే ప్రేమే దేవుడు కనుక. అయితే ఈ కోవకు చెందిన కేవలం ఒక్క ఉపన్యాసం విని జాన్ ఆఫ్ గాడ్‌గారిలో పరివర్తనం కలిగి పునీతుడు అయ్యేలా చేసిందంటే గొప్ప విశేషమే మరి.

జాన్‌గారు పోర్చుగల్ దేశంలో క్రీ॥శ॥ 1495లో పుట్టారు. కాని వీరు జీవనాధారం కోసం తమ బాల్యంలో స్పెయిన్‌లోని ఒక ధనికుని వద్ద గొర్రెలకాపరిగా ఉంటూ పెరిగి పెద్ద వాడయ్యారు. ఆ తరువాత కొంత కాలం ఫ్రాన్స్‌లో చాలా ప్రమాదకరమైన సైనిక ఉద్యోగంలో ఉన్నారు. సైనికుడుగా కాస్టిల్‌లోని కౌంట్‌ఓరో ప్రసాకు చెందిన సైనికదళంలో 13 సం॥లు పనిచేశారు. ఈ కాలంలో స్పెయిన్ ఫ్రెంచి దేశాల మధ్య జరిగిన యుద్ధాల్లో పాల్గొన్నారు. పిమ్మట హంగరీ దేశంలోని టర్కులకు వ్యతిరేకంగా యుద్ధంలో పాల్గొన్నారు. తన 40వ ఏట సైనిక ఉద్యోగం వదివేసి సెవిల్లెవద్ద మరలా గొర్రెల కాపరిగా పని చేశారు. సామాన్యునిలా జీవించారు. తర్వాత జిబ్రాల్టర్ ప్రాంతంలో కొంతకాలం పాటు క్రైస్తవ మత పుస్తకాల్ని చిత్రపటాల్ని అమ్మే పనిచేశారు.

జాన్‌గారికి 45 సం॥ల ప్రాయమప్పుడు బాలయేసు వీరికి దర్శనమయ్యారు "జాన్! నీ సేవలు గ్రనెడ నగరానికి చాలా అవసరం" అని సందేశమిచ్చారు. బాలయేసు కోరిక ప్రకారం జాన్‌గారు గ్రనెడ వెళ్లారు. ఒక రోజు పునీత అవిలానగర జాన్ గారు గ్రనెడాకు విచ్చేసి ప్రేమ, సేవ గురించి గంభీర ఉపన్యాసమిచ్చారు. ఈ ఉపన్యాసానికి జాన్ ఆప్ గాడ్ గారిపై చాలా గొప్ప ప్రభావం చూపించింది. వారి హృదయంలో అపూర్వ స్పందన చైతన్యం కలిగింది. దాని ఫలితంగా తన ఆస్తులన్నింటిని పేదలకు పంచిపెట్టి రిక్తహస్తుడై తన్నుతాను దైవ సేవకు అంకితం చేసుకున్నారు. అప్పటి వరకు తాను వృధా చేసిన యవ్వనకాలానికి గాను బహుగా దు:ఖించారు. భవిష్యత్తులో ఎక్కువ సేవలందించి దేవుని సంతృప్తి పరచాలనుకున్నారు. తనను ఇంతగా

ప్రభావితం చేసిన అవిలానగర జాన్ గారి వద్ద తన గత పాపాలకు మన్నింపు పొంది వారి సలహా ప్రోత్సాహం మేరకు అక్కడి నిరుపేదలు, రోగులకు సేవలందిస్తూ వారి బాధలను ఉపశమింపచేయాలని దీక్షబూనారు.

గ్రనెడాలో ఒక చిన్న ఇంటిని అద్దెకు తీసుకున్నారు. అక్కడకు రాలేని స్థితిలో ఉన్న వ్యాధిగ్రస్తులను తానే స్వయంగా మోసుకుని వచ్చేవారు. రోగుల్ని ఆ ఇంటికి చేర్చిన వెంటనే వారి పాదాలను కడిగి వారికి సిలువ స్వరూపాన్ని అందించేవారు. అనంతరం ఆ రోగులను పడకలపై పడుకోబెట్టి అవసరమైన వారు మంచి పాపసంకీర్తన చేసుకునేందుకు ఒక గురువును ఏర్పాటు చేసేవారు. ఒక వైపు రోగులకు వైద్య పరిచర్యలు చేస్తూనే మరోవైపు ఆ ఇంటిని పరిశుభ్రంగా ఉంచుతూ వారికి అవసరపడే ఆహారాన్ని ఔషధాలను తానే స్వయంగా అందిస్తూ అన్ని పనులూ తానొక్కడే చేసేవారు. మిగతా సమయాలలో తను చేస్తున్న కృషిలో దేవుని దీవెనలు సహాయం అందిచమని దేవుని వేడుకుంటూ ఉండేవారు. ఆ రోగులకు కావాల్సిన ఆహార పదార్థాలు, పండ్లు, డబ్బు కోసం ఆ నగరమంతా బొంగరంలా తిరుగుతూ భిక్షాటన చేసేవారు. కొన్ని కొన్ని వీధుల్లో ధర్మం అడిగేటప్పుడు "సోదరులారా! దేవుని ప్రేమ కోసం మీరు ఒక మంచి కార్యం చేయండ" ని బిగ్గరగా పిల్చేవారు జాన్. దీనులకు ధర్మం చేస్తే యేసుప్రభువుకు చేసినట్టేనని అందుకు ఈ లోకజీవిత పరీక్షలో ఈ విధంగా మంచి మార్కులు సంపాదించి మరణానంతరం ఉత్తీర్ణులై మోక్షభాగ్య బహుమానం పొందండని చెప్తుండేవారు.

జాన్‌గారు తన కృషిలో పొందిన దానధర్మాలు ఆర్థిక సాయంతో గ్రెనడా నగరంలో ఒక పెద్ద వైద్యశాలను నిర్మింపజేశారు. వైద్యపరిచారక బ్రదర్ల సభను కూడా స్థాపించారు. ఇందు సేవాదృష్టికల వారిని చేర్చుకొని దేవుని ప్రేమను క్రియాత్మకంగా చూయించిన నిండు మానవతామూర్తి త్యాగమయుడు జాన్. క్రీస్తునాథుని శిష్యరికంలో దినాదినాభివృద్ధి పొందుతున్న జాన్‌గారి త్యాగము, సేవ అనేకృషి పంటను స్థానిక మేత్రానులైన "టూయి" గారు ఎంతో ప్రశంసిస్తూ జాన్ గారిని జాన్ ఆప్ గాడ్ అనగా దేవుని యొక్క జాన్ అని పిలిచారు. జాన్ గారి ఆధ్యాత్మిక జ్ఞానసంపదకు ఈ పేరు బాగా నప్పింది. అంతేగాక బిషప్ టూయిగారు బ్రదర్ జాన్ ఆప్ గాడ్ గారిచే నెలకొల్పకొనబడిన వైద్య పరిచారక బ్రదర్ల సభను గుర్తించి వారికి సంబంధించి నిబంధనావళి పుస్తకాన్ని రూపొందించి వారు ధరింపవలసిన దుస్తుల రంగును నమూనాను నిర్ణయించారు. అదేవిధంగా ఆ బ్రదర్ల సభ నేటికిని వైద్యశాలల్లో వైద్యపరిచర్య సేవలతో మందులు ఆహారం వగైరా రోగులకందిస్తూ మానవసేవ, దేవుని సేవ కొనసాగిస్తూనే ఉన్నారు.


ఆనాడు జాన్ అఫ్ గాడ్ గారి సహాయాన్ని అర్థించే వారిలో శరణార్థులు, విధవరాండ్రు, అనాథలు, పేదలు, విధ్యార్థులు, నిరుద్యోగులుండటం విశేషం. వారంతా జాన్‌గారి సహాయం సలహాల ద్వారా ఎంతో ఉపశమనాన్ని ఊరటను పొందుకునేవారు. ఆనాటి గ్రనెడా పీఠాధిపతులు తమ సందేశాలలో జాన్ గారి సేవలను బహిరంగంగా శ్లాఘింస్తుండేవారు.

పవిత్రతకు పరిచర్యకు మారు రూపమైన జాన్‌గారు అనేక అద్భుత కార్యాలు కూడ చేసి క్రీస్తు ప్రభుని ఘనపరిచారు. ఒక రోజు బలిపీఠం ముందు ప్రార్థిస్తూనే తన ఆత్మను ప్రభుని పవిత్ర హస్తాల్లో పెట్టారు. ఇది 1550వ సం॥ములో జరిగింది. పరిశుద్ధ పాపుగారు వీరికి పునీత పట్టాన్నిచ్చి సన్మానింపగా శ్రీసభ పునీత జాన్ గారిని ఆసుపత్రులు, రోగులు, ముఖ్యంగా హృద్రోగులు, నర్సులు, ముద్రాపకులు, పుస్తకవిక్రేతలకు పాలక పునీతులుగా ఏర్పాటు చేసింది. గౌరవించుకుంది.

**ధ్యానాంశం :**

**నీకున్న సమయంలో ఎలాంటి విరామం లేకుండా నీ శక్తి కొలది మంచి పనులన్నీ చేయి. ప్రభూ! నీ ముండ్లే నాకు రోజాపుష్పాలు. నీ శ్రమలే నాకు స్వర్గం.**

# బైబిల్ దృశ్యమాలిక


ఏండ్లు గడిచాయి. జెత్రో కూతురు "సిప్పోరా" ను పెళ్లాడాడు ఇద్దరు కొడుకులు కలిగారు
ఒకనాడు ....
ఎందుకు అంత దిగులు పడి ఉన్నావు?
ఏం చెప్పమంటావు? నా వాళ్లంతా ఈజిప్టులో ఎన్నో బాధలు అనుభవిస్తున్నారు.
ఆ రాజద్రోహులను ఇంకా మరచిపోలేదా?
!
సిప్పోరా! దాస్యంతో అలిసిపోయిన వాళ్ళు సరిగా ఆలోచించలేరు. నా సొంత జనాన్ని నేనెలామర్చిపోదును
!
ఎన్నాళ్లు ఈ అడవిలో నేను దాక్కోవాలి? నా వాళ్లకు విడుదల ఎప్పుడు? ఎలా?
ఆ ! ఎంత మంటలు మండుతున్న పొద కాలడం లేదు.


"మోషే" చెప్పలు వదులు. నువ్వు నిలబడి ఉన్న నేల పరిశుద్ధమైనది. !!
!!
నా ప్రజల దురావస్థను నేను చూచాను. ఈజిప్తీయుల బారి నుండి వారిని విడిపించ బోతున్నాను. వారి పితరులకు వాగ్దానం  చేసిన దేశానికి వారిని తీసుకు వస్తాను. నిన్ను ఫరోవద్దకు పంపుచున్నాను. నా జనులు నన్ను పూజించడానికి పోనివ్వమని అతనికి ఆజ్ఞాపించు.
ఎవరండో తమరు?!
నేను "యెహోవాను", ఇశ్రాయేలు  దేవుడను. నేను నీకు అండగా ఉంటాను. భయపడకు.

# శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు

## యెహెజ్కేలు 1-24 అధ్యాయాలు

1) విశ్రాంతి (23,38)

2) ప్రభువు (1,28)

3) దుష్కార్యములకుగాను (7,27)

4) ప్రజలగుదురు, దేవుడు (14,11)

5) హృదయమును, మనసును (18,31)

6) ఇరువది ఐదుగురు (8,16)

7) యెరూషలేము (4,1)

8) అనృతములు (13,8)

9) కాలము, దినము (6,12)

10) దేవుడను, ప్రభువునగు (5,11)

11) దేవుని ఆత్మ (3,12)

12) మనుష్య (10,8)

13) దేవుని (11,22)

14) పవిత్రము (20,20)

15) పుణ్యము (14,20)

16) విశ్రాంతి (22,8)

17) తీర్పు (7,8)

18) ప్రభువునని (11,12)

19) నిబంధనమును (16,62)

20) ఎన్నుకొనినపుడు (20,5)

21) వాక్శక్తిని (24,27)

22) పరీక్ష (21,13)

23) తేజస్సును (16,14)

24) లోకము (5,5)

25) అపరాధములెల్ల (16,63)

**వచ్చే నెల పాఠ్యాంశం: దానియేలు గ్రంథం 1-14 అధ్యాయాలు**

# శుభాకాంక్షలు అందించండి



**జన్మదినం, వివాహము, వివాహ వార్షికోత్సవ, విచారణ పండుగలను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేయాలనుకునేవారికి ఇదొక సదావకాశం. మీరు మీ ఫోటోను, ప్రచురించవలసిన వార్తను పంపించినట్లయితే మేము మీ తరుపున ఈ మాసపత్రికలో శుభాకాంక్షలు ప్రచురిస్తాము.**

బ్లాక్ & వైట్ ఫుల్ పేజీ రూ. 1000/–

బ్లాక్ & వైట్ ఆఫ్ పేజీ రూ. 500/–

బ్లాక్ & వైట్ క్వాటర్ పేజీ రూ. 250/–

ఈ సదావకాశమును వినియోగించుకొని మీ కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు తెలియజేయండి.

**వివరాలకు సంప్రదించండి**

9440874028

**రచయితలారా, గమనించండి ! వెంటనే రచనలు పంపండి!**

ఆధ్యాత్మిక స్ఫూర్తినిచ్చే రచనలు, కథానికలు, కవితలు, పిల్లల కథలు, మన విశ్వాసం గురించిన వివిధ అంశాలపై సామాజిక స్ఫూర్తినిచ్చే రచనలు వెంటనే పంపండి. **మీ రచనలు ప్రతినెల 12వ తేదిలోగా చేరాలి.**
అలస్యంగా వచ్చే రచనలు పరిశీలింపబడవు.

**వివరాలకు సంప్రదించండి**

9398764408

**ఈ పత్రికను పొందాలనుకునే వారు మీ వివరాలు, అడ్రస్ మాకు పంపించండి**

**వార్షిక చందా 120 రూ॥లు**

**మా అడ్రస్**

**జీవస్వరం**

బిషప్స్ హౌస్, మంచిర్యాల – 504 208

మంచిర్యాల జిల్లా, తెలంగాణ

Cell : 9398764408, e-mail : jeevaswarammagazineadb@gmail.com